క్లుప్తంగా

ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

కొలిమిగుండ్ల: బి.ఉప్పులూరులోని అభయాంజనేయస్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో విగ్రహాన్ని ప్రతిష్ఠించి 41 రోజులు పూర్తయిన సందర్భంగా వేదపండితులు ఆలూరి రాఘవేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. అభిషేకం,ఆకుపూజతో పాటు విశేష పూజలు చేపట్టారు. గ్రామస్తులు మండల పూజలో పాల్గొన్నారు.

హుండీ లెక్కింపుతో ఆలయానికి ఆదాయం



యాగంటిలో హుండీ సొమ్ము లెక్కిస్తున్న దృశ్యం

బనగానపల్లెరూరల్ : మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన శ్రీ ఉమామహేశ్వరస్వామి ఆలయంలో భక్తులు హుండీల్లో సమర్పించిన విరాళాల లెక్కింపు ద్వారా ఆలయానికి రూ.20,90,022 ఆదాయం సమకూరిందని ఆలయ కార్యనిర్వాహణాధికారి పాండురంగారెడ్డి బుధవారం తెలిపారు. ఈ ఏడాది మార్చి 20 నుంచి ఇప్పటి వరకు భక్తుల కానుకల లెక్కింపునకు ఆలయ పర్యవేక్షణాధికారి హరిశ్చంద్రారెడ్డి, యాగంటిపల్లె ఉపసర్పంచ్ బండి మౌలీశ్వరరెడ్డి, బండికుమార్‌రెడ్డి, సంకేశ్వరరెడ్డి, భరతుడు, ఆలయ అర్చకులు మహేష్‌శర్మ, సత్యనారాయణశర్మ, ఆలయ సిబ్బంది ప్రసాద్, బాలాజీ సేవాసమితి ఉన్నారు.

12న వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం



కాటసాని రామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే

బనగానపల్లె : స్థానిక ధనలక్ష్మి ఫంక్షన్‌హాల్‌లో ఈ నెల 12వ తేదీన వైఎస్సార్ సీపీ నియోజక వర్గ విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ..కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, పార్టీ జిల్లా పరిశీలకులు ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి హాజరవుతారని చెప్పారు. సమావేశానికి నియోజకవర్గంలోని అన్ని మండలాల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అనుబంధ సంఘాల కన్వీనర్లు, సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వాటర్ ప్లాంట్ ఏర్పాటు



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

బనగానపల్లె: భక్తుల దాహం తీర్చేందుకు పట్టణంలోని అవుకు రహదారిలోనున్న సాయి బాబా ఆలయంలో సొంత నిధులతో ఉచిత కూలింగ్ మినరల్ వాటర్ ప్లాంట్‌ను పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు బీసీ గుర్రెడి బీసీ లక్ష్మమ్మ దంపతుల జ్ఞాపకార్థం ప్రార్థన మందిరాల్లో ఉచిత కూలింగ్ మినరల్‌వాటర్ ప్లాంట్స్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఆలయ కమిటీ సభ్యులు శ్రీరామసుబ్రహ్మణ్యం, బలరామయ్య, గాథం శెట్టి వేణుగోపాల్ పాల్గొన్నారు.

సుకన్య సమృద్ధి యోజనపై అవగాహన



పోస్టల్ సేవలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

బేతంచెర్ల: బాలికల కోసం ప్రవేశ పెట్టిన సుకన్య సమృద్ధి యోజనను సద్వినియోగం చేసుకోవాలని బేతంచెర్ల పోస్టు మాస్టర్ నాగరాజు సూచించారు. సరస్వతి శిశుమందిర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు బుధవారం పోస్ట్ ఆఫీసును సందర్శించారు. ఈ సందర్భంగా పోస్టల్ సేవలు, మనీ డిపాజిట్ స్కీమ్స్ గురించి ఆయన వివరించారు.

14న అప్రెంటిషిప్ మేళా

డోన్ టౌన్: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 14న ప్రధానమంత్రి జాతీయ అప్రెంటిషిప్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ప్రసాద్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రజావ్యతిరేక ప్రభుత్వాలకు పతనం తప్పదు



బనగానపల్లెలో తహసీల్దార్ నారాయణరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం



బేతంచెర్లలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

డోన్ టౌన్: ప్రజావ్యతిరేక పాలన సాగించే ప్రభుత్వాలకు పతనం తప్పదని కార్మిక సంఘాల నాయకులు హెచ్చరించారు. దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా బుధవారం పట్టణంలో ర్యాలీలు, నిరసనలు చేపట్టి అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం డోన్ బ్రాంచి అధ్యక్ష, కార్యదర్శులు రహంతుల్లా, దేవన్నల ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. వీరికి క్లాస్1 ఉద్యోగులు, ఏజెంట్ల సంఘం నాయకులు మద్దతు తెలిపారు. ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి రంగనాయకులు ఆధ్వర్యంలో కార్మికులతో ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి శివరామ్, మండల నాయకులు నక్కి శ్రీకాంత్, భాస్కర్‌రెడ్డి, చిన్నరహిమాన్, రామాంజనేయులు, నాగమద్దయ్య తదితరుల ఆధ్వర్యంలో కార్మికులు ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి అధికారి రవికుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సుంకయ్య, వ్యకాస జిల్లా అధ్యక్షులు రాధకృష్ణ, మండల అధ్యక్ష, కార్యదర్శులు అన్వర్, అబ్బాస్, అంగన్‌వాడీ వర్కర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి జులేఖ, సీపీఐ పట్టణ, మండల కార్యదర్శులు మోటా రాముడు, నారాయణల ఆధ్వర్యంలో కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు ర్యాలీ నిర్వహించి పాత బస్టాండ్‌లోని సమైఖ్యాంధ్ర కట్ట వద్ద సమావేశం నిర్వహించి కేంద్ర ప్రభుత్వ తీరును ఎండగట్టారు.

బేతంచెర్ల: కార్మికులను బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎల్లయ్య, మండల నాయకులు వెంకటేశ్వర్లు, మధు శేఖర్ డిమాండ్ చేశారు. బుధవారం సమ్మెలో భాగంగా అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, వివిధ కార్మిక సంఘాల నాయకులతో కలిసి పట్టణ పురవీధుల గుండా కొత్త బస్టాండు వరకు భారీ ర్యాలీ నిర్వహించి, మానవ హారంగా నిలిచి నిరసన తెలిపారు. స్టేట్ బ్యాంక్ ఎదురుగా సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్, ఏఐటీయూసీ నాయకులు నిరసన తెలిపారు.

ప్యాపిలి: కార్మిక చట్టాలను పటిష్టపరచాలని ఆవాజ్ కమిటీ డోన్ డివిజన్ అధ్యక్షులు అబ్దుల్ రసూల్, సీఐటీయూ మండల అధ్యక్షులు రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి ఎస్ఏ చిన్న రహిమాన్ డిమాండ్ చేశారు. సమ్మెలో భాగంగా బుధవారం ప్యాపిలిలో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులు ప్రాణత్యాగాలు చేసి సాధించుకున్న చట్టాలను కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్స్‌గా మార్చిందన్నారు. మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఒక్కరూ ఖండించాలన్నారు. కార్యక్రమంలో ఆవాజ్ కమిటీ మండల అధ్యక్షులు ఇమాముద్దీన్, పంచాయతీ కార్మికులు రంగస్వామి, నెట్టికల్లు, నాగరాజు, మారెప్ప తదితరులు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: 12గంటల పని విధానాన్ని రద్దు చేసి ఎనిమిది గంటల విధానాన్ని అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు దావీదు డిమాండ్ చేశారు.దేశవాప్త సమ్మెలో భాగంగా బుధవారం అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయం చేరుకొని డిప్యూటీ తహసీల్దార్ విశ్వతేజకు వినతి పత్రం అందించారు.

సంజామల: కేంద్రం ప్రభుత్వం లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ఎస్ఐఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఆర్ నాయక్, సీఐటీయూ మండల కార్యదర్శి సుజాత హెచ్చరించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ నుంచి కార్యాలయం నుంచి బస్టాండ్ సర్కిల్ వరుకు బుధవారం ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు,ఆయాలు పాల్గొన్నారు.

అవుకు: కార్మికుల హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా సెక్రటరీ శివ బాలకృష్ణ డిమాండ్ చేశారు. ఉద్యోగ, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు బుధవారం మండలంలో నిర్వహించిన సమ్మె విజయవంతమైందని తెలిపారు. ముందుగా స్థానిక బస్టాండ్ ఏరియాలో ర్యాలీ నిర్వహించారు. నాయకులు నాగాంజనేయులు, బాల ఉశేని, వెంకటేశ్వర్లు, కిట్టు, చిన్నమ్మ, నరసింహులు పాల్గొన్నారు.

బనగానపల్లె రూరల్: కార్మికులు, ప్రజలకు నష్టం కలిగించే నాలుగు లేబర్ చట్టాలను రద్దు చేయాలని కోరుతూ బుధవారం నిర్వహించిన సమ్మె బనగానపల్లె పట్టణంలో విజయవంతమైంది. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం నుంచి సీఐటీయూ, అంగన్‌వాడీ వర్కర్లు, ఆటో కార్మికుల ఆధ్వర్యంలో పెట్రోల్‌బంకు మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ జరిగింది. తహసిల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమంలో సీఐటీయూ డివిజన్ కార్యదర్శి సుబ్బయ్య మాట్లాడారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ నారాయణరెడ్డికి అందజేశారు.అంగన్‌వాడీ నాయకురాల్లు రోజారమణి ఆటో యూనియన్ నాయకులు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు



డోన్‌లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ర్యాలీ చేస్తున్న దృశ్యం,



కోవెలకుంట్ల గ్రామ పంచాయతీ సర్కిల్‌లో మానవహారం నిర్వహిస్తున్న కార్మిక సంఘ నాయకులు

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

కోవెలకుంట్ల: కేంద్రప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను, లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన దేశవ్యాప్త సమ్మె కోవెలకుంట్లలో విజయవంతమైంది.యూనియన్‌తో పాటు అంగన్‌వాడీ, ఆశావర్కర్లు, ఆటో కార్మికులు, హమాలీ సంఘం కార్మికులు స్థానిక జమ్మలమడుగు చౌరస్తా నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. గ్రామ పంచాయతీ సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడి తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఆందోళన చేపట్టారు. ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు కరీంబాషా, సీఐటీయూ జిల్లా నాయకుడు సుధాకర్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కార్మికులకు అన్యాయం చేస్తూ 44 కార్మిక చట్టాలను బడా కార్పోరేటర్ల కోసం నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చిందన్నారు. అలాగే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎనిమిది గంటల పనిదినాన్ని 12 గంటల పనిదినాలుగా మారుస్తున్న జీఓను రద్దు చేయాలని, స్కీం వర్కర్లకు నెలకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని,పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, ఉపాధి బడ్జెట్‌లో కూలి రేట్లను పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ అసోసియేషన్ జిల్లా నాయకురాలు వెంకటలక్ష్మి, సరస్వతి, అరుణ, శివనాగలక్ష్మి, పుల్లమ్మ, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు సరస్వతి, లక్ష్మీదేవి, అరుణ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో జియారత్

- పీర్లకు ఫాతెహాలు సమర్పించిన భక్తులు
- భక్తులతో కిటకిటలాడిన గుళ్లదూర్తి



దస్తగిరి స్వామి, మౌలాలిస్వామి పీర్ల వద్ద పాతెహాలు సమర్పిస్తున్న భక్తులు

కోవెలకుంట్ల: మండలంలోని గుళ్లదూర్తి గ్రామంలో దస్తగిరి, మౌలాలి పీర్ల జియారత్ పూజలు బుధవారం నుంచి ప్రారంభయ్యాయి. మధ్యాహ్నం నగరికుల పెద్దల ఆధ్వర్యంలో కందూరు నిర్వహించారు. జార్లలను పురస్కరించుకుని గ్రామంలో వెలసిన పీర్ల చావిళ్లను విద్యుత్‌దీపాలతో అలంకరించారు. పీర్లకు భక్తులు దట్టీలు, వెండి గొడుగులు, పూల దండలను ఊరేగింపుగా తీసుకొచ్చి అలంకరించారు. వివిధ గ్రామాలకు చెందిన భక్తులు సాయంత్రం నుంచి రాత్రి వరకు ఫాతెహాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. జిల్లా నుంచే కాకుండా వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, అనంతపురం జిల్లా తాడిపత్రి, అనంతపురం, హైదరాబాదు, తదితర ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. దీంతో గుళ్లదూర్తి జనసంద్రమైంది. అర్ధరాత్రి పీర్ల ఊరేగింపు ప్రారంభం కాగా గురువారం సాయంత్రంతో జియారత్ పూజలు ముగియనున్నాయి. కోవెలకుంట్ల సీఐ హనుమంతునాయక్, ఎస్ఐలు మల్లికార్జునరెడ్డి, భూపాలుడు సిబ్బందితో బందోబస్తు చేపట్టారు.

పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలి



సంజామలలో మాట్లడుతున్న ఎంపీడీఓ సాల్మన్

సంజామల: గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు,అధికారులు కలిసి కట్టుగా కృషి చేయాలని ఎంపీడీఓ స్మాలన్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ అధ్యక్షతన పంచాయతీ పురోగతి సూచిక శిక్షణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లడుతూ.. మండలంలో 17 శాఖలకు సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు సేకరించాలని సూచించారు. తహసీల్దార్ అనిల్ కుమార్, మండల పరిపాలన అధికారి విజయకుమార్ రెడ్డి,ఈఓఆర్డీ రాధికారెడ్డి,మెడికల్ ఆఫీసర్ కృష్ణకుమారి పాల్గొన్నారు.

బనగానపల్లె రూరల్ : గ్రామాల అభివృద్ధి ప్రణాళికల తయారీలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని మండల ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగరాజు అన్నారు. బుధవారం స్థానిక పాదుపు భవనంలో పంచాయతీ పురోగతి సూచిక వర్షన్ 2.0 ఎఫ్‌వై 2023–24 శిక్షణ కార్యక్రమంతో పాటు ఆర్‌జీఎస్ఏ మాన్యూవల్ యాక్షన్ ప్లాన్–2025– 2026 పై అవగాహన కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో వ్యవసాయం,పశుసంపద,వసతుల కల్పన వంటి అంశాలకు సంబంధించి అన్ని శాఖల అధికారులు ప్రణాళికలను తయారు చేయాలని సూచించారు. ఏఓ సుబ్బారెడ్డి, డిప్యూటీ ఎంపీడీఓ సతీష్ కుమార్‌రెడ్డి, పీఆర్ ఏఈ రమణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయికృష్ణ, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్స్,డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్: పేరంటాలమ్మ గుడి సబ్ స్టేషన్ వద్ద 33 కెవి లైన్ షిఫ్టింగ్ పనుల కారణంగా హైవే ఫీడర్ కింద ఉన్న శ్రీరామనగర్, టీచర్స్ కాలనీ, వైఎస్సార్ నగర్, కోట్ల నగర్‌తోపాటు మండలంలోని లక్ష్మంపల్లె, మల్లెంపల్లె గ్రామాలకు గురువారం ఉదయం 10 నుంచి సాయిత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జగదుర్తి సబ్ స్టేషన్ పరిధిలో జరుగుతున్న ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు పనుల కారణంగా వెల్దుర్తి 33 కెవి ఫీడర్ లైన్ షిఫ్టింగ్ కారణంగా 10 నుంచి సాయిత్రం 4 గంటల వరకు జగదుర్తి సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు, ఇండస్ట్రీస్‌కు విద్యుత్ అంతరాయం ఉంటుందని, రైతులకు ఇచ్చే త్రీఫేస్ కరెంటు తెల్లవారు జామున 5 నుంచి ఉదయం 10 గంటల వరకు, సాయిత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు ఇవ్వనున్నట్లు ఏఈ తెలిపారు.

నేడు వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం

డోన్ టౌన్: పట్టణ సమీపంలోని జాతీయ రహదారి వెంకటాపురం రోడ్డులో ఉన్న ఐకన్వెన్షన్ హాల్‌లో గురువారం మధ్యాహ్నం 3 గంటల నుంచి మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ కార్యాలయం బుధవారం ఒక ప్రకటన జారీ చేసింది. కార్యక్రమానికి మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, పార్లమెంటు మాజీ సభ్యులు పోచా బ్రహ్మానందరెడ్డి, జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి, నియోజకవర్గ పరిశీలకురాలు కల్ప లతారెడ్డి రానున్నారని, నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తరలిరావాలని ప్రకటనలో పేర్కొంది.

నేడు గురుపౌర్ణమి



కోవెలకుంట్లలో వేడుకలకు ముస్తాబవుతున్న సాయిబాబా ఆలయం

కోవెలకుంట్ల: పట్టణ శివారులోని గుంజలపాడు రహదారి పక్కన వెలసిన షిర్డి సాయిబాబా ఆలయంలో గురువారం నిర్వహించనున్న గురుపౌర్ణమి సందర్భంగా కాగడ హారతి, విశేష అభిషేకం, గణపతి, రుద్ర, దత్త హోమాలు, పూర్ణాహుతి, మధ్యాహ్న హారతి, అన్నదాన వితరణ, తదితర కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు సతీష్‌శర్మ బుధవారం తెలిపారు. అలాగే పట్టణంలోని సత్యసాయి ఆలయం, మండలంలోని భీమునిపాడులో వెలసిన పద్మనాభస్వామి ఆశ్రమంలో పద్మనాభస్వామికి అభిషేకం, పంచ బ్రహ్మలింగేశ్వరస్వామికి రుద్రాభిషేకం, హోమం, మంగళహారతి, స్వామివారి పల్లకీసేవ తదితర కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

కొలిమిగుండ్ల: స్థానిక షిర్డీసాయి మందిరంలో షిర్డీ సాయి సేవాట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం గురుపార్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. తెల్లవారుజామునే ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ట్రస్ట్ అధ్యక్షుడు వీడీ రాజగోపాల్ ఆధ్వర్యంలో ఉదయం నుంచి రాత్రి వరకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భజన బృందాల ఆధ్వర్యంలో భక్తి గీతాల ఆలపాన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఎర్ర సింధూరం యాడబోయే తల్లీ సాంఘిక నాటకాన్ని కళాకారులు ప్రదర్శించనున్నారు. వేడుకలకు అనంతపురం, నంద్యాల ఎంపీలు అంబికా లక్ష్మీనారాయణ, బైరెడ్డి శబరి హాజరు కానున్నారు.

విస్తారంగా వరి నారుమళ్ల సాగు



బనగానపల్లె సమీపంలో వరి నారు పోసిన దృశ్యం

బనగానపల్లె: నియోజకవర్గంలో ఖరీఫ్‌లో రైతులు వరి పంట సాగుకు రైతులు సన్నాహాలు ప్రారంభించారు. ఏటా జిల్లాలోనే బనగానపల్లె నియోజకవర్గంలో ఎక్కువ విస్తీర్ణంలో వరి పంటను సాగు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ సంవత్సరం శ్రీశైలం ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో ప్రారంభమైన నాటి నుంచే రైతులు వరి నారు పోయడం ప్రారంభించారు. ఏటా ఖరీఫ్‌లో బీపీటీ 5204, నంద్యాల సోనా రకం పంటలను అధిక విస్తీర్ణంలో సాగు చేస్తారు. ఇక్కడి భూములు వరి సాగుకు అనుకూలంగా ఉండటంతో పంట సాగుకు అన్నదాతలు ఉత్సాహం చూపుతున్నారు. గతేడాది ఖరీఫ్‌లో నియోజకవర్గంలో సుమారు 18వేల హెక్టార్లలో ఎస్సార్‌బీసీ, అవుకు రిజర్వాయర్, చెరువులు, బోర్ల కింద వరి పంట సాగు చేశారు. అలాగే.. రబీలోనూ 11వేల హెక్టార్లలో సాగైంది. ఈ సంవత్సరం ఖరీఫ్‌లో సాగు విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉందని వ్యసాయాధికారులు పేర్కొంటున్నారు. ఇందుకు ముందస్తున్న నారు పోసుకున్నారు.

తహసీల్దార్‌కు వినతి పత్రం



అవుకు తహసీల్దార్ మల్లికార్జున రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ఆరోగ్య సిబ్బంది

కోవెలకుంట్ల: వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించాలని ఆ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మైమూన్ డిమాండ్ చేశారు. బుధవారం కోవెలకుంట్లలో ఆమె మాట్లాడుతూ సచివాలయాల్లో పనిచేస్తున్న గ్రేడ్–3 ఏఎన్ఎంలను మాతృసంస్థ అయిన వైద్య ఆరోగ్యశాఖలో విలీనం చేయాలని, సిబ్బందిపై యాప్‌ల పనిభారం తగ్గించాలని, పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు. మెడికల్ రంగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరించాలని కోరారు. అనంతరం తహసీల్దార్ పవన్ కుమార్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

అవుకు: ఆరోగ్య సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని యూఎంహెచ్ఈ జిల్లా ట్రెజరర్ వెంకటేశ్వరమ్మ డిమాండ్ చేశారు. బుధవారం ఆమె మాట్లాడుతూ.. ఎంపీహెచ్ఏ , సెకెండ్ ఏఎన్ఎంలను రీ డిప్లయ్‌మెంట్‌ను క్యాన్సిల్ చేసి పూర్వపు సబ్ సెంటర్లకు పంపించాలని డిమాండ్ చేశారు. సచివాలయంలో పని చేస్తున్న గ్రేడ్ 3 ఏఎన్ఎంలను మాతృ సంస్థ అయిన వైద్య ఆరోగ్య శాఖలో విలీనం చేయాలని, యాప్‌ల పనిభారాన్ని తగ్గించాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. పీఆర్‌సీ ఏర్పాటు చేసి, ఐఆర్ వెంటనే ఇవ్వాలన్నారు. అనంతరం తహసీల్దార్ మల్లికార్జున రెడ్డికి బుధవారం వినతి పత్రం అందజేశారు. జ్యోత్స్న, సరస్వతి, దానమ్మ, శారద, ఆశావర్కర్లు, బుక్ కీపర్లు పాల్గొన్నారు.

నేడు గురు పౌర్ణమి వేడుకలు

డోన్ టౌన్: పట్టణ సమీపంలో నూతనంగా నిర్మించిన షిర్డీ సాయిబాబా ఆలయంలో గురువారం పౌర్ణమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. ఉదయం 5 రాత్రి 8 గంటల వరకు వివిధ పూజలు ఉంటాయని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకోవాలని సూచించారు.

విండ్ పవర్ ఏర్పాటుకు రైతులు సహకరించాలి



మాట్లాడుతున్న ఆర్డీఓ నరసింహులు

బేతంచెర్ల: విండ్ పవర్ ఏర్పాటుకు రైతులు సహకరించాలని ఆర్డీఓ నరసింహులు కోరారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నాగమణి, ఏకోరన్ అధికార ప్రతినిధి దివాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎం.పెండేకల్లు, ముద్దవరం గ్రామ రైతులతో సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ విండ్ పవర్ ఏర్పాటులో భాగంగా 30 ఏళ్ల అగ్రిమెంట్‌తో తీసుకుంటున్న భూములకు ఎకరాకు ఏడాదికి రూ.30వేల చొప్పున రైతులకు చెల్లిస్తారన్నారు. రెండేళ్లకోసారి 5 శాతం పెంచుతారన్నారు. కాగా ఏడాదికి ఒక్కసారి కాకుండా 30 ఏళ్లకు సంబంధించి ఒకే సారి పరిహారం ఇవ్వాలని రైతులు కోరారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీసీఎంఓ

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీసీఎంఓ డాక్టర్ అంకిరెడ్డి బుధవారం తనిఖీ నిర్వహించారు. రికార్డులను పరిశీలించి, రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం వైద్య సిబ్బందితో రోగులకు అందించే వైద్య సేవలపై చర్చించారు. కార్యక్రమంలో వైద్యులు అబ్దుల్ అలీమ్, ఎంపీహెచ్ అబ్దుల్ గఫార్, జూనియర్ అసిస్టెంట్ పురుషోత్తం రెడ్డి పాల్గొన్నారు.

కర పత్రాలు పంపిణీ



కర పత్రాలను పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

డోన్ టౌన్: వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుపై ముద్రించిన కర పత్రాలను బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు హేమసుందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం స్థానిక పాతబస్టాండ్ గాంధీ విగ్రహం వద్ద పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వక్ఫ్ ఆస్తుల నిర్వహణను సంస్కరించే లక్ష్యంతో సవరణ బిల్లు 2024 ఆగస్టు 8న లోక్ సభలో ప్రవేశ పెట్టబడిందని, ఇస్లామిక్ చట్టానికి అనుగుణంగా మతపరమైన, ధార్మిక లేదా పవిత్ర ప్రయోజనాల కోసం అంకితం చేయబడిన ఆస్తులు జవాబుదారీ తనంతో పారదర్శకంగా పెంపొందించడానికి ప్రయత్నిస్తోందని అవగాహణ కల్పిస్తూ కర పత్రాలను పంపిణీ చేశారు. మరిన్ని వివరాలకు ప్రతిఒక్కరూ కర పత్రాలను చదివి అవగాహణ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కమలేష్, నాగార్జున, అశోక్, లక్ష్మణ్, హరినాయుడు, వీరేష్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన కార్మికుల నిరసన

బనగానపల్లె రూరల్ : పట్టణంలోని ఆర్టీసీ డిపో మేనేజర్ ఏకపక్ష వైఖరికి వ్యతిరేకంగా నేషనల్ మజ్దూర్ యూనిట్ అసోసియేషన్ కమిటీ కార్మికులు డిపో గ్యారేజ్ ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి చేపట్టిన నిరసన కార్యక్రమం రెండో రోజు బుధవారం కొనసాగింది. అసోసియేషన్ కమిటీ ట్రెజరర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ డిపో మేనేజర్ ప్రయాణికులు, విద్యార్థుల రద్దీకి అనుగుణంగా బస్సు సర్వీస్‌లు నడుపడం లేదన్నారు. మెకానిక్‌లకు ఆధునిక స్పేర్ పార్ట్స్ తెప్పించడంలేదని ఆరోపించారు. నాయకులు ఎల్లయ్య,జమ్ములయ్య, ప్రహ్లాద్, లక్ష్మన్న పాల్గొన్నారు.

పంచాయతీల సమాచారం సేకరించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ

బేతంచెర్ల: ప్రతి పంచాయతీలో అన్ని విభాగాలకు సంబంధించిన పూర్తి సమాచారం సేకరించాలని ఎంపీడీఓ ఫజుల్‌రహిమాన్ తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో పంచాయతీల పురోగతి, 2025–26 సంవత్సరం కార్యాచరణ ప్రణాళికపై పంచాయతీ కార్యదర్శులు డిజిటల్ అసిస్టెంట్స్, ఇంజినీరింగ్ అసిస్టెంట్స్ కు ఒక్క రోజు శిక్షణ ఇచ్చారు. పంచాయతీ ఆదాయ వనరులు, పొలం విస్తీర్ణం, బోర్లు, రైతులు, విద్యార్థులు, పలు అంశాలపై సంబంధిత అధికారుల నుంచి సమగ్ర సమాచారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్ వైజర్లు తిప్పమ్మ, రాధ, ఎంఈఓ సోమశేఖర్, ఏఓ విజయ కుమార్ రెడ్డి, పంచాయతీ రాజ్ ఇంజనీర్ మహేష్ పాల్గొన్నారు.

వేలం ద్వారా రూ.24.5లక్షల ఆదాయం



వేలంపాట నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

బనగానపల్లె: మండలంలోని నందవరం చౌడేశ్వరి అమ్మవారి ఆలయంలో బుధవారం చౌడేశ్వరి అమ్మవారి శేషవస్త్రాలకు బుధవారం నిర్వహించిన బహిరంగ వేలం ద్వారా రూ.75,12,369 వచ్చినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ నెల 16 నుంచి 2026 జూలై 15 వరకు ఉంటుందన్నారు. ఇందులో బహిరంగ వేలం పాట రూ.62 లక్షలు కాగా షీల్డ్ కొటేషన్ ద్వారా వచ్చిన మొత్తం రూ.75,12,369 లభించిందన్నారు. వేలం కంటే షీల్డ్ కొటేషన్ ద్వారా వచ్చిన పాట హెచ్చుగా ఉన్నందున షీల్డ్ కోటేషన్ వేసిన పి.జంబులయ్యను హెచ్చుపాటదారునిగా గుర్తించిన్నట్లు తెలిపారు. గత సంవత్సరం కన్నా రూ.24.56 లక్షల ఆదాయం సమకూరిందని చెప్పారు. పులిహోర తయారీ టెండర్, లావు బియ్యం పులగం బియ్యంకు టెండర్ నిర్వహించగా సరైన ధర లభించనందున వేలంను రద్దు చేశామని వెల్లడించారు.